# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-06-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **నూతనంగా ఏర్పడిన 18వ లోక్‌సభ సభాపతి ఎన్నిక ఈరోజు జరుగుతుంది.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.**

3. **దేశంలోని ఉత్తమ రవాణా విధానాన్ని తెలంగాణలోనూ అమలుచేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**

4. **ఈరోజు అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినం పాటిస్తున్నారు.**

5. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది.**

==========================

దేశంలో నూతనంగా ఏర్పడిన 18వ లోక్‌సభ సభాపతి ఎన్నిక ఈరోజు జరుగుతుంది. సభాపతిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడంలో అధికార, విపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈ ఎన్నిక జరగనుంది. గత లోక్‌సభలో సభాపతిగా వ్యవహరించిన భారతీయ జనతా పార్టీ సీనియర్ పార్లమెంట్ సభ్యులు ఓం బిర్లా ఈసారి కూడా ఎన్‌డిఏ తరపున నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు ఇండియా కూటమి తరపున కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యులు కె. సురేష్ కూడా సభాపతి పదవికోసం నామినేషన్ వేశారు. స్వతంత్ర భారత చరిత్రలో సభాపతి పదవికి ఎన్నిక జరగడం ఇదే మొదటిసారి.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి నిన్న కుప్పంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ..కుప్పం అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఊరిలో తాగునీరు, డ్రైనేజీలు, వీధిదీపాలు ఏర్పాటు చేస్తామని, అన్ని గ్రామాలకు కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. హంద్రీ-నీవా కాలువ నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. కుప్పంలోని నాలుగు మండలాలను ఆదర్శపట్టణాలుగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మరోవైపు ఈరోజు

కూడా ముఖ్యమంత్రి కుప్పంలో పర్యటించి జిల్లా నేతలతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం శాంతిపురం మండలంలోని గుండిశెట్టిపల్లి వద్ద కాలువను పరిశీలిస్తారని అధికారులు తెలిపారు.

---------------------------

పౌరసరఫరాల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. నిన్న విజయవాడలోని పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో మంత్రి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న పౌరసరఫరాల నిల్వ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. పరిశీలనలో పంచదార, కందిపప్పు, పామాయిల్ ప్యాకెట్లలో వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే సరుకుల్లో పారదర్శకంగా వ్యవహరిస్తామని మంత్రి పేర్కొంటూ....

**.....వాయిస్.... 32 సెకన్లు.....**

---------------------------

దేశంలోని ఉత్తమ రవాణా విధానాన్ని తెలంగాణలోనూ అమలుచేస్తామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిన్న మంత్రి హైదరాబాద్‌లో మాట్లాడుతూ, నూతన రవాణా విధానం కోసం వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేస్తామని వెల్లడించారు. రాష్ట్రాల వారీగా వేర్వేరు పన్నుల విధానం అమలవుతోందని.. అందులో ఆదాయం వచ్చేందుకు అనువుగా ఉన్న విధానాలపై దృష్టి సారిస్తామన్నారు. దీనికోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేశామనీ ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాల్లో అధ్యయనం చేయనున్నామని మంత్రి వివరించారు.

---------------------------

అరకు కాఫీకి సంబంధించి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి. సంధ్యారాణి తెలిపారు. నిన్న అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గిరిజన శాఖపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. అనంతరం పాత్రికేయులతో ఆమె మాట్లాడుతూ అరకు కాఫీకి దేశ విదేశాల్లో ప్రాచుర్యం కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. నెలకోసారి గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. 554 గిరిజన పాఠశాలల్లో ఆరోగ్య కార్యకర్తలను నియమిస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాల్లోని 960 చౌక దుకాణాలు పునరుద్ధరించి, చౌక ధర దుకాణాల ద్వారా మాత్రమే రేషన్ పంపిణీ చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఈరోజు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినం పాటిస్తున్నారు. ప్రతిఏటా జూన్ 26 వ తేదీన అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేకదినం పాటించాలని ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధిసభ ఇచ్చిన పిలుపు మేరకు ఈ కార్యక్రమం జరుగుతోంది. 1987 డిసెంబర్ 7వ తేదీన ఐక్యరాజ్యసమితి ఈమేరకు ఒక తీర్మానం ఆమోదించింది. మాదక ద్రవ్యాలు తీసుకోవడం వల్ల కలిగే నష్టాలను ప్రజలకు ప్రత్యేకించి యువతకు తెలియజేయడమే ఈకార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. కాగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగ, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక కార్యక్రమం ఈరోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట "మన్ కీ బాత్" కార్యక్రమం 111వ సంచిక ఈ నెల 30వ తేదీన ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి "మన్ కీ బాత్" కార్యక్రమం ఇది. ప్రజలు తమ సలహాలు, సూచనలను ఈ నెల 28లోగా టోల్ ఫ్రీ నెంబర్ 1800-11-7800కు ఫోన్ చేసి గాని, నరేంద్ర మోదీ యాప్ లేదా మై గౌవ్ ఫోరమ్, ఇతర వేదికల ద్వారా తెలియజేయవచ్చు.

-------------------------

తెలంగాణలో మాదక ద్రవ్యాల వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్ నెక్లెస్‌రోడ్డులో జలవిహార్ వద్ద డ్రగ్స్ నిర్మూలన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, అవగాహన లేకపోవడంతో మాదక ద్రవ్యాలకు యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారని తెలిపారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని, మత్తు పదార్థాల వినియోగంపై కళాశాలల యాజమాన్యాలు దృష్టిసారించాలన్నారు. మాదక ద్రవ్యాల నివారణకు ప్రభుత్వ యంత్రాంగమే కాకుండా ప్రజలు కూడా సహకారం అందించాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

-------------------------

ప్రజా సమస్యలను చట్టసభల్లో బలంగా వినిపించేందుకు ప్రతిపక్ష హోదా ఉండాల్సిందేనని, ఈ విషయంలో పరిశీలన చేయాలని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి అయ్యన్నపాత్రుడికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లేఖ రాశారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు గురించి చట్టంలో స్పష్టంగా పొందుపరిచారని తెలిపారు. విపక్షంలో ఉన్న పార్టీల్లో ఎవరికి ఎక్కువ సంఖ్యాబలం ఉంటే వారికి ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వాలని చట్టం చెబుతోందన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పొత్తు పెట్టుకుని, సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం వల్ల విపక్షంలో ఉన్న ఏకైక పార్టీ వైసీపీ మాత్రమేనని ఈ విషయాన్ని పరిశీలించాలని లేఖలో జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

-------------------------

తెలుగు సాహిత్యాన్ని ఔపోసన పట్టిన కోవెల సంపత్ కుమారాచార్య జయంతి ఈరోజు. తెలంగాణా రాష్ట్రం వరంగల్ పట్టణంలో 1933 జూన్ 26వ తేదీన ఆయన జన్మించారు. బాల్యంలోనే వైష్ణవాగమాలను అభ్యసించిన ఆయన వరంగల్ సంస్కృత పాఠశాలలో చేరి సంస్కృతభాషలో మంచి ప్రావీణ్యం సంపాదించారు. ఆనంద లహరి, అపర్ణ, చందో వికాసము, వచన పద్యం, ఆధునిక తెలుగు సాహితీ విమర్శ వంటి అనేక రచనలు చేసిన సంపత్ కుమారాచార్య 2010 వ సంవత్సరం ఆగస్టు 5వ తేదీన కన్నుమూశారు.

-------------------------

తెలంగాణలో గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్‌ను కోరారు. నిన్న ఢిల్లీలో కేంద్రమంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు.

=====================